సాక్షి
ఆదిలాబాద్

శనివారం ၊ 6 ၊ మే ၊ 2023



ఉపాధ్యాయ శిక్షణ పిలుస్తోంది

డీఎడ్ దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 22వ రకు గడువు ఉంది. ఉమ్మడి జిల్లాలో ఏడు కళాశాలలు ఉండగా.. 500 సీట్లు అందుబాటులో ఉన్నాయి. 8లో▸



బుద్ధుడి మార్గం అనుసరణీయం

బుద్ధుడు చూపిన మార్గం అనుసరణీయమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని అశోక బుద్ధ విహార్‌లో శుక్రవారం బుద్ధ జయంతిని నిర్వహించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
36.0 /27.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి. గాలిలో తేమ శాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

నేడు జిల్లా కేంద్రంలో 144 సెక్షన్

కైలాస్‌నగర్: టీఎస్ఆర్ఎస్‌జేసీ సెట్ –2023 పరీక్ష నిర్వహణ దృష్ట్యా ఈ నెల 6న జిల్లా కేంద్రంలో 144సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ సతీశ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జిరాక్స్ కేంద్రాలను మూసిఉంచాలని, అలాగే నలుగురికి మించి గుంపులుగా తిరగరాదని సూచించారు.

సౌకర్యాలు కల్పించాలని వినతి



లియాఖత్ అలీకి వినతిపత్రం అందజేస్తూ..

ఆదిలాబాద్‌అర్బన్: జిల్లాలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సేవ ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం టీఎంఆర్ఈఐఎస్ సంయుక్త కార్యదర్శి లియాఖత్ అలీని కోరారు. ఈ మేరకు జిల్లా పర్యటన నిమిత్తం ఆదిలాబాద్‌కు వచ్చిన ఆయనను మైనార్టీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో టీఎంఆర్ఈఐఎస్ డీఐవో లతీఫ్, హెచ్‌వోలు నయీమ్, మాలిక్, ఆదిలాబాద్, నిర్మల్ డీఎండబ్ల్యూవోలు కృష్ణవేణి, స్రవంతి, విజిలెన్స్ అధికారి రవిచరణ్‌దాస్ రెడ్డి, ప్రిన్సిపాళ్లు, సేవ ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

వంటావార్పుతో జేపీఎస్‌ల నిరసన



వంటావార్పుతో నిరసన తెలుపుతున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

కైలాస్‌నగర్: తమ సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె 8వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా గురువారం వారు వంటావార్పుతో నిరసన వ్యక్తం చేశారు. శిబిరం వద్దే వంటలు వండుకుని, సహపంక్తి భోజనాలు చేశారు. వీరి ఆందోళనకు మాజీ మంత్రి రాంచంద్రారెడ్డి మద్దతు తెలిపారు. శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ వాటిని అమలు చేయకుండా మోసం చేస్తున్నారన్నారు. జేపీఎస్‌ల పోరాటానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

పంట నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం



దేవాపూర్‌లో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న పుల్లయ్య

తలమడుగు: అకాల వర్షాలతో పంట నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం అందేలా చుస్తామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య అన్నారు. మండలంలోని దేవాపూర్, పునగుడ గ్రామాల్లో ఇటీవల కురిసిన అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. సర్వే వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏవో మహేందర్, ఏఈవోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

నేరడిగొండ: రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య దుకాణదారులను హెచ్చరించారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయదారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. చట్టానికి లోబడి విక్రయాలు చేపట్టాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. దుకాణాల్లో బోర్డుల ఏర్పాటుతో పాటు విక్రయించిన రైతులకు రశీదులు అందజేయాలన్నారు. వీటిని పంట కాలం పూర్తయ్యేంత వరకు భద్రపరుచుకోవాలని రైతులకు సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలకు అధైర్యపడొద్దన్నారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా కల్పించారు. సమావేశంలో బోథ్ ఏడీఏ శ్రీధర్ స్వామి, ఏవో భాస్కర్, ఎస్సై సాయన్న, విక్రయదారులు, రైతులు పాల్గొన్నారు.

మొక్కు'బడి'గా..



ఇక్కడ అసంపూర్తిగా కనిపిస్తున్నది భీంపూర్ మండలం నిపాని ప్రాథమిక పాఠశాలలోని మన ఊరు– మనబడి కింద చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణం. ఈ పనుల కోసం రూ.59 లక్షలు మంజూరయ్యాయి. ప్రస్తుతం పిల్లర్ల దశలో నిలిచిపోయాయి. ఏడాది గడిచినా ముందుకు సాగడం లేదు. తరగతి గదులు లేక విద్యార్థులు గతేడాది పంచాయతీ భవనంలో కూర్చొని పాఠాలు విన్నారు. నూతన విద్యా సంవత్సరం నాటికి కూడా భవనం పూర్తయ్యేలా కనిపించడం లేదు.



ఇక్కడ కనిపిస్తున్నది బజార్‌హత్నూర్‌లోని ప్రాథమిక పాఠశాల. మన ఊరు–మనబడిలో ఎంపిక చేసిన ఈ పాఠశాల అభివృద్ధి కోసం రూ.14.92 లక్షల నిధులు మంజూరయ్యాయి. శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూల్చి అదే చోట కొత్త భవన నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇప్పటికీ కనీసం భూమి పూజ చేయకపోగా.. కూల్చిన శిథిలాలను సైతం తొలగించకుండా అలాగే వదిలేశారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి కూడా భూమి పూజ చేపట్టే అవకాశాలు కనిపించడం లేదు. **ఇవే కాదు.. జిల్లాలో 'మన ఊరు– మన బడి' కింద చేపట్టిన అనేక పాఠశాలల్లో ఇదే పరిస్థితి.**

- ముందుకు సాగని మన ఊరు–మనబడి పనులు
- ఇప్పటికి పూర్తయినవి కేవలం తొమ్మిది శాతమే..
- స్కూళ్లు తెరిచే నాటికి మిగతావి అనుమానమే
- 'సాక్షి' విజిట్‌లో తేటతెల్లం

ఆదిలాబాద్‌టౌన్: మన ఊరు– మనబడి కింద చేపట్టిన పనులు జిల్లాలో నత్తనడకన సాగుతున్నాయి. ఏడాది గడిచినా సర్కారు బడుల నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. పలుమార్లు విద్యాశాఖ అధికారులతో ఉన్నతస్థాయి అధికారులు సమీక్షలు సైతం నిర్వహించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించినా పరిస్థితిలో మార్పు కానరావడం లేదు. గత విద్యా సంవత్సరం తెరిచే నాటికే పనులు పూర్తి చేస్తామని చెప్పినా అది ఆచరణలో సాధ్యం కాలేదు. ఈ విద్యా సంవత్సరం నాటికి సైతం పూర్తిస్థాయిలో సిద్ధమయ్యేటట్లు కనిపించడం లేదు. ఏడాదిలో కేవలం పది బడులు మాత్రమే ప్రారంభించడం గమనార్హం. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల అలసత్వమే కారణంగా తెలుస్తోంది. కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్ది మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం మన ఊరు–మనబడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో తొలివిడతలో శ్రీకారం చుట్టిన ఆయా బడుల్లో కొన్నిచోట్ల ఇంకా పునాది దశలోనే ఉన్నట్లు 'సాక్షి' విజిట్‌లో తేలింది. అలాగే పలు ఆసక్తికర విషయాలు సైతం వెలుగులోకి వచ్చాయి.

ప్రారంభమైనవి పది మాత్రమే..

మన ఊరు–మనబడి కార్యక్రమం కింద జిల్లాలో గతేడాది 237 పాఠశాలలను తొలివిడతలో ఎంపిక చేశారు. వీటిలో 141 ప్రాథమిక, 36 ప్రాథమికోన్నత, 60 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి.

- జిల్లాలోని ఆదిలాబాద్ నియోజకవర్గంలో 78, బోథ్ నియోజకవర్గంలో 99, ఖానాపూర్ నియోజకవర్గంలో 41, ఆసిఫాబాద్ నియోజకవర్గ పరిధిలో 19 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందుకు గాను మొత్తం రూ.88.82 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. వీటిలో పది మాత్రమే ప్రారంభానికి నోచుకున్నాయి. ఆదిలాబాద్ పట్టణంలోని హమీద్‌పూర, విద్యానగర్, ఖుర్షీద్‌నగర్, చిల్కూరి లక్ష్మీనగర్, ఖానాపూర్ పాఠశాలలు, అలాగే ఇచ్చోడలోని అడిగామ, సిరికొండ మండలంలోని పొన్న, సుంకిడి, జైనథ్ మండలంలోని కరంజి, బేల మండలంలోని సైద్‌పూర్ పాఠశాలలు ఉన్నాయి.

జిల్లాలో 'మన ఊరు-మనబడి' వివరాలు

ఎంపికైన పాఠశాలలు	237
ఇప్పటివరకు ప్రారంభించినవి	10
ప్రారంభానికి సిద్ధంగా ఉన్నవి	10
పెయింటింగ్ పూర్తి చేసినవి	60
గ్రీన్ బోర్డులు ఏర్పాటు చేసినవి	37
డ్యూయల్ డెస్కులు వచ్చినవి	37

బడులు తెరిచే నాటికి పనులు పూర్తి చేస్తాం

మన ఊరు–మనబడి ద్వారా జిల్లాలో మొదటి విడత 237 పాఠశాలలు ఎంపిక య్యాయి. ఇప్పటి వరకు పది పాఠశాలలను పునఃప్రారంభించాం. మరో పది ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. మిగతా చోట్ల ఈనెల చివరి నాటికి పూర్తి చేసేలా లక్ష్యం పెట్టుకున్నాం. త్వరితగతిన చేపట్టాలని కాంట్రాక్టర్లను ఆదేశించాం. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడతాం.

– ప్రణీత, డీఈవో

మరో పది వరకు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని విద్యా శాఖాధికారులు చెబుతున్నారు.

పునఃప్రారంభం నాటికి అనుమానమే..

నూతన విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే నాటికి కూడా పనులు పూర్తవడం అనుమానంగానే ఉంది. వచ్చే నెల 15 నాటికి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులను ఇప్పటికే పలుమార్లు ఆదేశించారు. అయినా వివిధ కారణాలతో పనులు ముందుకు సాగడం లేదు. ఏటా విద్యార్థులు ఆయా పాఠశాలల్లో వసతులు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అనేక గ్రామాల్లో చెట్ల కింద చదువులే దిక్కయిన ఘటనలు అనేకం. మరికొన్ని చోట్ల శిథిల బడుల్లోనే విద్యాబోధన సాగించాల్సిన దుస్థితి.

పలుచోట్ల నత్తనడకన..



జైనథ్‌లో ఇంకా పిల్లర్ దశలోనే పనులు

- నేరడిగొండ మండలంలోని వడూర్, బొందిడి, మథురతాండ, వాంకిడి, తేజాపూర్, బుగ్గారం(బి), తర్నం, కుమారి గ్రామాల్లో పనులు నత్తనడకన సా..గుతున్నాయి.
- బేల మండలంలో 18 పాఠశాలలు ఎంపిక చేయగా.. సైద్‌పూర్, బాధి పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. మిగతావి నిలిచిపోయాయి. జూన్ వరకు కూడా పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు.
- తలమడుగు మండలంని కుచులాపూర్ పాఠశాలలో చేపట్టిన పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు.
- జైనథ్ మండలంలో 22 పాఠశాలలు ఎంపిక కాగా పనులు కొనసాగుతున్నాయి.
- నార్నూర్ మండలంలో 11 పాఠశాలలను ఎంపిక కాగా, గుంజాలలో మాత్రమే పనులు పూర్తయ్యాయి. గాదిగూడ మండలంలో 8 పాఠశాలలు ఎంపిక కాగా, కేవలం కొత్తపల్లి(జి), కొలామ పాఠశాలల్లోనే పూర్తయ్యాయి.
- భీంపూర్ మండలం నిపాని గ్రామంలో ప్రాథమిక పాఠశాలకు మరమ్మతుతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు చేపట్టారు. ఇంకా పిల్లర్ల దశలోనే ఉన్నాయి.
- తాంసి మండలంలో 5 పాఠశాలలు ఎంపిక కాగా, మూడు చోట్ల పనులు తుది దశకు చేరుకున్నాయి. తాంసి, వడ్డాడి పాఠశాలల్లో ఇంకా ప్రారంభించలేదు.
- ఇచ్చోడ మండలంలో 17 పాఠశాలలు ఎంపిక కాగా, ఇస్లాంనగర్, అడెగామ(కె) పాఠశాలల్లో 50 శాతం పనులు పూర్తి కాగా, మిగతా చోట్ల ప్రారంభ దశలోనే ఉన్నాయి.
- ఆదిలాబాద్‌రూరల్ మండలంలో 11 పాఠశాలలు, మావల మండలంలో 4 పాఠశాలలు ఎంపిక కాగా, ఏ ఒక్క పాఠశాలలోనూ పనులు ప్రారంభం కాలేదు.

దిగిన లిక్కర్ ధర

- ఫుల్‌బాటిల్‌పై రూ.40 డౌన్
- అమ్మకాలు తగ్గడంతో ప్రభుత్వ నిర్ణయం
- నేటి నుంచి అమలులోకి

సాక్షి, ఆదిలాబాద్: మందు బాబులకు సర్కారు తీపి కబురు అందించింది. లిక్కర్ ధర తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఫుల్‌బాటిల్‌పై రూ.40 తగ్గనుంది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో లిక్కర్ సేల్స్ ద్వారా ప్రభుత్వానికి నాలుగు శాతం ఆదాయం పెరిగింది. అయినా అమ్మకాలు మాత్రం పడిపోయాయి. ఇది ఎలాగని ఆశ్చర్యపోతున్నారా.. ఏడాది క్రితం ప్రభుత్వం వీటి ధరలు పెంచింది. ఆ కారణంగా అమ్మకాలు తగ్గినా ఆదాయం పెరిగింది. అయితే ప్రభుత్వ లక్ష్యం భిన్నంగా ఉంటుంది. అమ్మకాలతో పాటు ఆదాయమూ పెరగాలి. అయితే ఇక్కడ సేల్స్ తగ్గిపోవడం, ఆదాయం నామమాత్రంగా పెరగడం కారణంగా ప్రభుత్వం తాజాగా ధరల విషయంలో దిగివచ్చింది. దీనికి సంబంధించి జీవో జారీ అయినట్లు అధికారులు చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 192 వైన్స్‌లు, 39 బార్లు ఉన్నాయి. వీటి ద్వారా 2021–22 తో పోల్చితే 2022–23లో ఇండియన్ మేడ్ లిక్కర్ (ఐఎంఎల్) కేసుల అమ్మకాలు 3లక్షల 2వేల 933 తగ్గాయి. ఇంత పెద్ద మొత్తంలో తగ్గడంతో ఎక్సైజ్ అధికారులు తలపట్టుకోవాల్సిన పరిస్థితి. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి స్థితే ఉండడంతో ఎక్కడో పొరపాటు జరిగిందనేది ప్రభుత్వం తర్జనభర్జన పడింది. ప్రధానంగా గతేడాది ప్రభుత్వం లిక్కర్ ధరలను అమాంతంగా పెంచింది. ఇది పొరుగు రాష్ట్రాల్లో ధరలతో పోల్చితే అధికంగా ఉండడంతో మందుబాబులు సరిహద్దుకు వెళ్లినప్పుడు అక్కడి నుంచి కొనుగోలు చేయడంతోనే ఇలాంటి పరిస్థితి ఉత్పన్నమైందని ప్రభుత్వం దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ధరలు తగ్గింపుపై దృష్టి సారించింది. అయినా మహారాష్ట్రతో పాటు ఇప్పటికీ అధికంగా ఉన్నాయన్న అభిప్రాయం మందుబాబుల్లో వ్యక్తమవుతుంది.

చీప్‌లిక్కర్‌పైనే ప్రభావం..


సాధారణంగా ఐఎంఎల్, బీర్ కేసుల అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుంది. అయితే ఐఎంఎల్ అమ్మకాలే అధిక ఆదాయానికి దోహద



వైన్స్‌లో మద్యం బాటిళ్లు

పడుతుంది. బీర్ల అమ్మకాలు పెరిగినా ఐఎంఎల్ సేల్స్ తగ్గిపోవడం ప్రభుత్వానికి ఆలోచనకు గురిచేసింది. ప్రధానంగా చీప్ లిక్కర్ అమ్మకాలు తగ్గడంతో ఆదాయంపై తీవ్ర ప్రభావం కనిపిస్తుంది. లిక్కర్ ధర రూ.400 లోపు ఉన్నది చీప్‌లిక్కర్‌గా పరిగణిస్తారు. రూ.700లోపు ఉన్నదాన్ని మీడియం లిక్కర్‌గా, రూ.850 పైన దాన్ని ప్రీమియం లిక్కర్‌గా పరిగణిస్తారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 49శాతం చీప్ లిక్కర్ అమ్మకాలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తగ్గిపోయాయి. ఇది భారీగా రావాల్సిన ఆదాయంపై ప్రభావం చూపుతుంది. మీడియం లిక్కర్ 17శాతం, ప్రీమియం లిక్కర్ 12 శాతం అమ్మకాలు తగ్గాయి. మొత్తంగా లిక్కర్ సేల్స్‌పై ధరల పెంపు ప్రభావమే కనిపించిందని ఎక్సైజ్ అధికారులు బాహాటంగానే పేర్కొంటున్నారు. దీంతోనే ఆదాయం తగ్గిందని చెబుతున్నారు.

నేటి నుంచి అమలు



లిక్కర్ ధరలను ప్రభుత్వం తగ్గిస్తూ జీవో జారీ చేసింది. శనివారం నుంచి అమలు కానున్నాయి. ఫుల్‌బాటిల్‌పై రూ.40, హాఫ్‌పై రూ.20, క్వార్టర్‌పై రూ.10 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే పాత స్టాక్ అదే ధరలపై అమ్మడం జరుగుతుంది. కొత్త స్టాక్ వచ్చిన తర్వాత నూతన ధరలు అమల్లోకి వస్తాయి.

– నర్సింహారెడ్డి, డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్‌శాఖ

లిక్కర్, బీర్ కేసుల అమ్మకాలు.. ఆదాయం

సంవత్సరం	ఐఎంఎల్ కేసులు	బీర్ కేసులు	ఆదాయం (రూ. కోట్లలో)
2021–22	21,75,425	17,47,653	1649
2022–23	18,72,492	22,77,981	1716
వ్యత్యాసం	3,02,933	5,30,328	67
శాతం	–14	30	4



విద్యుత్ ప్రమాదాలను నియంత్రించాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: భద్రతా సూచనలు పాటిస్తూ విద్యుత్ ప్రమాదాలను నియంత్రించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా జెడ్పీ సమావేశ మందిరంలో వినియోగదారులు, సిబ్బందికి శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీగలు తెగిపోవడం, స్తంభాలు విరగడం వంటి లోపాలు ఏర్పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని, వినియోగదారులు భద్రత ప్రమాణాలు పాటిస్తే వాటిని అరికట్టవచ్చన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించి, ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే జిల్లాలో 600 గిరిజన ఆవాసాల్లో త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా చేసినట్లు తెలిపారు. ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, నిర్లక్ష్యంతో జరిగే ప్రమాదాలే ఎక్కువగా ఉంటున్నాయని, వాటిల్లోనే ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ఇలాంటి వాటిని గుర్తించి ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ, విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్, సీజీఎం అశోక్ కుమార్, డీఈ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడా పోటీలు పకడ్బందీగా నిర్వహించాలి

సీఎం కప్–2023 క్రీడా పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పోటీల నిర్వహణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. చీఫ్ మినిస్టర్ కప్–2023 క్రీడా పోటీలను విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 15 నుంచి 17వరకు మండలస్థాయి, 22 నుంచి 24 వరకు జిల్లా స్థాయి, 28 నుంచి 31వరకు రాష్ట్ర స్థాయి పోటీలు ఉంటాయని తెలిపారు. ఇందులో పాల్గొనేందుకు క్రీడాకారులను సన్నద్ధం చేయాలన్నారు. మండల స్థాయిలో నిర్వహించే అథ్లెటిక్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి క్రీడా పోటీల నిర్వహణకు మే 10 లోగా సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు ప్రథమ బహుమతి రూ.లక్ష నగదుతో పాటు బంగారు పతకం, ద్వితీయ బహుమతిగా రూ.75వేలు, రజత పతకం, తృతీయ బహుమతిగా రూ.50వేలు, కాంస్య పతకం అందజేయనున్నట్లు తెలిపారు. సింగిల్స్ విభాగంలో ప్రథమ బహుమతిగా రూ.20వేలు, స్వర్ణ పతకం, ద్వితీయ బహుమతిగా రూ.15వేలతో పాటు రజత పతకం, తృతీయ బహుమతిగా రూ.10వేలతో పాటు కాంస్య పతకం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పోటీలను విజయవంతం చేసి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రిజ్వాన్, ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ, జిల్లా క్రీడల శాఖ అధికారి వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈవో గణపతి, జిల్లా ఒలింపిక్ క్రీడా అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, గిరిజన క్రీడా శాఖ అధికారి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

'అగ్రి' వర్సిటీ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఎదులాపురం: జిల్లాలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పచ్చజెండా ఊపిన విషయం తెలిసిందే. ఈమేరకు యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా కేటాయించిన భూములను వర్సిటీ, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం పరిశీలించారు. జైనథ్ మండలం కాన్స మేడిగూడ గ్రామం సాత్నాల ప్రాజెక్ట్ పరిధిలోని 50 ఎకరాల భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రెండేళ్లలోపు భవనం, వసతిగృహాల నిర్మాణాలు పూర్తి చేసే దిశగా కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ సుధీర్‌కుమార్, డీఎస్ఏఫ్అగ్రికల్చర్ శ్రీను, అధికారులు మోహన్‌రెడ్డి, రాఘవేంద్ర, శివకుమార్, విజయ్ కుమార్, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త శ్రీధర్ చౌహాన్, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, జైనథ్ ఎంపీపీ గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఫుడ్ ఫెస్టివల్



ఆదిలాబాద్: మున్సిపల్, మెప్మా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గాంధీపార్క్‌లో శుక్రవారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్, గీతాలాపన పోటీలు ఆకట్టుకున్నాయి. జిల్లా అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. పోటీదారులు తీసుకువచ్చిన ఆహార పదార్థాలను ఆయన రుచి చూశారు. అనంతరం నిర్వహించిన గీతాలాపన పోటీల్లో పలువురు ఆలపించిన గీతాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ తదితరులు పాల్గొన్నారు.





క్లుప్తంగా

ఎస్టీ హోదా సాధించే దాకా పోరాటం

- మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే



మాట్లాడుతున్న సుకుమార్ పేట్కులే

తలమడుగు: మాలీలకు ఎస్టీ హోదా దక్కే వరకు పోరాటం ఆగదని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే అన్నారు. మండలంలోని బరంపూర్ బస్టాండ్ ప్రాంగణం వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పులే దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరించి మాట్లాడారు. పూలే దంపతుల స్ఫూర్తితో 22 ఏళ్లుగా మాలీ సంఘం పోరాటాలు సాగిస్తున్నదన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న షిండే, కోశాధికారి సతీశ్, సర్పంచ్ భగీరథ బాయి, ఉపసర్పంచ్ నారాయణరెడ్డి, కేదారేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీడీ దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ డీడీ ఎం.దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక కేబీ కాంప్లెక్స్ మైదానంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆశ్రమ పాఠశాల విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న క్రీడల శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈనెల 25 వరకు నిర్వహించనున్న శిబిరాల్లో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు చెందిన 85 మంది హాజరవుతున్నారన్నారు. వీరికి వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ వంటి క్రీడా అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, కోచ్‌లు సునంద్, శివ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ జంగ్‌సైరన్ జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బొజ్జు

ఖానాపూర్: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో ఈ నెల 8న తలపెట్టిన నిరుద్యోగ జంగ్‌సైరన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు కోరారు. శుక్రవారం పట్టణంలోని జేకే ఫంక్షన్‌హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగులకు అడుగడుగునా అన్యాయం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ సభ కనువిప్పు కావాలన్నారు. నిరుద్యోగ సమస్యపై ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. పాలకుల వైఫల్యంతో నేడు నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంజేశారు. నిరుద్యోగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. నాయకులు దయానంద్, షబ్బీర్‌పాషా, నిమ్మల రమేశ్, హేమంత్‌చారి, రాజునాయక్, జంగిలి శంకర్, రాజేశ్వర్, మల్లేశ్, తోట సత్యం, జహీర్‌హైమద్, సలీంఖాన్, రాసమల్ల అశోక్, శ్రీనివాస్, ఉత్తమ్, జయవంత్‌రావ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ శిక్షణ పిలుస్తోంది..!



- డీఎడ్‌కు దరఖాస్తుల ఆహ్వానం
- ఉమ్మడి జిల్లాలో ఏడు కళాశాలలు
- అందుబాటులో 500 సీట్లు
- ఈ నెల 22వరకు దరఖాస్తు గడువు

నిర్మల్ ఖిల్లా: సమాజంలో ఉపాధ్యాయులంటే గౌరవం ఎక్కువ. అందుకే తల్లిదండ్రుల తర్వాత స్థానం ఉపాధ్యాయులకిచ్చారు. ఈ వృత్తి.. సమాజంలో ఓ బృహత్తర బాధ్యత. ఉపాధి కల్పించే మార్గం కూడా.. ఇటు ప్రభుత్వ రంగంలో వేలసంఖ్యలో ఖాళీలు భర్తీ చేస్తుండగా.. అటు ప్రైవేట్ రంగంలోనూ అవకాశాలు పుష్కలంగా ఉంటున్నాయి. ఇటీవలి కాలంలో విద్యారంగం విస్తరిస్తుండడం .. అమల్లోకి వచ్చిన విద్యాహక్కు చట్టంతో అవకాశాలు పెరిగిపోతున్నాయి. చిన్న వయస్సులో ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగు పెట్టాలనుకునే వారికి ప్రభుత్వం మంచి అవకా శాన్ని కల్పిస్తోంది. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారికి డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఈ) రెండేళ్ల కోర్సులో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోంది. గతంలో టీటీసీ పేరుతో ఉండే ఈ కోర్సును ప్రస్తుతం డీఎడ్‌గా వ్యవహరిస్తున్నారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ వృత్తిని చేపట్టే వారికి డీఎడ్ అర్హత అవసరం. ప్రాథమిక పాఠశాలల్లో విద్యా బోధనకు ఇంటర్మీడియట్‌తో పాటు డీఎడ్ ఉత్తీర్ణులై ఉండాలి. ఆ తర్వాత టెట్, టీఆర్టీ (డీఎస్సీ) ద్వారా ఉపాధ్యాయులుగా నియామకం చేస్తారు. ఇప్పటికే ఇంటర్మీడియట్ పూర్తి చేసినవారు, ఈ ఏడాది ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసినవారు డీఈఈ సెట్‌కు అర్హులు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏడు డీఎడ్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో ప్రభుత్వ డైట్‌తోపాటు మరో ప్రైవేట్ కళాశాల ఉండగా, భైంసా, నిర్మల్ మంచిర్యాల, ఉట్నూర్, ఆసిఫాబాద్ ప్రాంతాల్లో మరో ఐదు ప్రైవేట్ కళాశాలలున్నాయి.

దరఖాస్తులు ప్రారంభం: ఏప్రిల్ 22
తుది గడువు: మే 22
హాల్‌టిక్కెట్లు డౌన్లోడ్ చేసుకోవడం: మే 27
ఆన్‌లైన్ పరీక్ష తేదీ: జూన్ 1
ఫలితాల ప్రకటన: జూన్ 8
ధ్రువీకరణ పత్రాల పరిశీలన, వెబ్ ఆప్షన్లు, సీట్లు/కళాశాలల కేటాయింపు: జూన్15 నుంచి జూలై 5 వరకు
తరగతులు ప్రారంభం: జూలై 12 నుంచి

ఇవీ.. కోర్సు వివరాలు

ఇంటర్‌తో ప్రభుత్వ ఉద్యోగాన్ని అందించే కోర్సు ఇది. రెండేళ్ల వ్యవధి గల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈడీ) ప్రథమ సంవత్సరంలో విద్యా మనో విజ్ఞానశాస్త్రం, విద్యాతత్వ శాస్త్రం, జనరల్ అంశాలైన పూర్వ ప్రాథమిక విద్య-ప్రస్తుత విద్య, ఆరోగ్యం, విద్య-కంప్యూటర్ ఎడ్యుకేషన్, వయోజనవిద్య తదితర సబ్జెక్టులు ఉంటాయి. రెండో సంవత్సరంలో తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్, సోషల్ సబ్జెక్టుల బోధన పద్ధతులను బోధిస్తారు. కోర్సులో భాగంగా టీచింగ్ ప్రాక్టీస్ 75 రోజులు ఉంటుంది. ఇందులో 35 రోజులు ప్రాథమిక పాఠశాలలు, 10 రోజులు ప్రాథమికోన్నత పాఠశాలల్లో బోధించాలి. 30రోజులపాటు పాఠశాలల్లో ఇంటర్న్‌షిప్ ఉంటుంది. డీఈడీ ఉత్తీర్ణులు ప్రభుత్వం నిర్వహించే ఉపాధ్యాయ నియామక పరీక్ష డీఎస్సీ (టీఆర్టీ)లో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) పోస్టుకు అర్హులు. ఎస్‌జీటీ పోస్టులను గతంలో కేవలం డీఈడీ అభ్యర్థులతోనే భర్తీ చేయగా ప్రస్తుతం బీఎడ్ వారికి కూడా అవకాశం కల్పించారు.

జిల్లా	కళాశాలలు	సీట్లు
ఆదిలాబాద్	3	300
నిర్మల్	2	100
కుమురంభీం	1	50
మంచిర్యాల	1	50
మొత్తం	7	500

ఇవీ.. అర్హతలు

భారతీయ పౌరులై ఉండి ఇంటర్మీడియట్ తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. బీసీ, ఓసీలు ఇంటర్‌లో కనీసం 50 శాతం, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 45 శాతం మార్కులు సాధించి ఉండాలి. ఈ ఏడాది సెప్టెంబర్ ఒకటో తేదీ నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాల్లో బోధన ఉంటుంది. ఉమ్మడి జిల్లాలోని ఏడు కళాశాలల్లో తెలుగు మాధ్యమంలో ఆరుచోట్ల, ఆంగ్లంలో మూడుచోట్ల, ఉర్దూలో ఒకచోట బోధనచేసే కళాశాలలున్నాయి. వంద ప్రశ్నలకు ప్రవేశపరీక్ష ఉంటుంది, ఒక్కో దానికి ఒక మార్కు చొప్పున వంద మార్కుల ప్రవేశ పరీక్షను ఆన్‌లైన్‌లో రాయాల్సి ఉంటుంది.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

డీఎడ్‌లో ప్రవేశం కోసం ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ నెల 22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఒక్కో అభ్యర్థి రూ.500 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. టీటీటీ. ఛీఛ్ఛి. ఛీఛీట్ళ్ళ ఛ్ళ్ళ్ళ. జౌరిజ్జీ ద్వారా అభ్యర్థి పేరు, పుట్టినతేదీ, ఫోన్ నంబర్ తదితర వివరాలు అందజేసి ఫీజు చెల్లించిన వారికి రెఫరెన్స్ ఐడీ ఇస్తారు. అనంతరం ఆన్‌లైన్‌లో దరఖాస్తు పత్రంలోని పూర్తి వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. టీఎస్ డీఈఈ సెట్ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తెల్ల కాగితంపై అభ్యర్థి ఫొటో అతికించి దాని కింద సంతకం చేయాలి. ఫొటో 50 కేబీ, సంతకం 30 కేబీలోపు ఉండేలా స్కాన్ చేయాల్సి ఉంటుంది.

వారంలో పెళ్లి.. యువకుడి మృత్యువాత

- రోడ్డు ప్రమాదంలో జేఎల్ఎం దుర్మరణం
- ఉద్యోగానికి సెలవు పెట్టి వస్తుండగా ఘటన



సాయి(ఫైల్)

దండేపల్లి: మరో వారం రోజుల్లో ఆ యువకుడి పెళ్లి. తోటి ఉద్యోగులకు పెళ్లి పత్రికలు పంచి.. ఉద్యోగానికి సెలవు పెట్టి మోటార్‌సైకిల్‌పై ఇంటికి బయల్దేరాడు. హార్వెస్టర్ రూపంలో మృత్యువు వెంటాడింది. వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో మృతిచెందాడు. దండేపల్లి ఎస్సై కుందారపు ప్రసాద్, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్సెట్టిపేట మండలం కొత్తకొమ్ముగూడెంకు చెందిన ఒగేటి సాయి(24) నిర్మల్ మండలం కొండాపూర్‌లో విద్యుత్ శాఖలో జేఎల్ఎంగా పనిచేస్తున్నాడు. అతడికి ఈ నెల 12 పెళ్లి జరగాల్సి ఉంది. గురువారం ఉదయం కొత్తకొమ్ముగూడెం నుంచి నిర్మల్‌కు వెళ్లాడు. పెళ్లి కోసం ఉద్యోగానికి సెలవు పెట్టాడు. అక్కడి మిత్రులు, తోటి ఉద్యోగులకు పెళ్లి పత్రికలు పంచి తన స్నేహితుడు మహేష్‌తో కలిసి మోటార్‌సైకిల్‌పై రాత్రి ఇంటికి బయల్దేరాడు. ఈ క్రమంలో దండేపల్లి మండలం మేదరిపేట సినిమా థియేటర్ సమీపంలో లక్సెట్టిపేట వైపు వెళ్తున్న హార్వెస్టర్ వీరి మోటార్‌సైకిల్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ కిందపడిపోయారు. సాయి తలకు తీవ్ర గాయాలు కావడంతో లక్సెట్టిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మహేష్‌కు తీవ్ర గాయాలు కాగా కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.



లక్సెట్టిపేట ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతుని కుటుంబీకులు, బంధువులు

పెళ్లింట విషాదం..

ఒగేటి సత్తయ్య-లక్ష్మీ దంపతులకు కొడుకు, కూతురు ఉన్నారు. కూతురుకు పెళ్లి చేశాడు. ఒక్కగానొక్క కొడుకు సాయి.. పైగా విద్యుత్ శాఖలో ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్లి ఎంతో ఘనంగా చేయాలనుకున్నారు. వారం రోజుల్లో పెళ్లి ఉండడంతో ఇంట్లో పెళ్లి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇంతలో రోడ్డు ప్రమాదంలో సాయి దుర్మరణం చెందడంతో ఆ ఇంట్లో తీరని విషాదాన్ని నింపింది. పెళ్లి వేడుకలతో సంతోషంగా ఉండాల్సిన కుటుంబ సభ్యులు.. కొడుకు మరణవార్తతో రోదనలు మిన్నంటాయి. చేతికి అందివచ్చిన కొడుకు, ఉద్యోగం చేస్తూ కుటుంబానికి ఎంతో అండగా ఉంటాడని కలలు కన్న ఆ తల్లిదండ్రులకు విధి తీరని దుఃఖాన్ని మిగిల్చింది.

పెళ్లి సెలవే శాశ్వత సెలవైంది..!

విద్యుత్ శాఖలో జేఎల్ఎంగా పనిచేస్తున్న సాయికి పెళ్లి కుదరడంతో అక్కడ తనతో పనిచేసే తోటి ఉద్యోగులకు పెళ్లి పత్రికలు పంచాడు. పెళ్లి కోసం సెలవు తీసుకున్నాడు. రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడంతో అతడు తీసుకున్న పెళ్లి సెలవులు శాశ్వత సెలవులయ్యాయి. సాయిని పెళ్లి కొడుకుగా చూడాలనుకున్న తన తోటి ఉద్యోగులు, మిత్రులకు అతడు విగత జీవిగా కనిపించడంతో ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతం అయ్యారు. ఈ ఘటన కుటుంబీకులు, బంధువులు, మిత్రులను కలిచివేసింది.

ఆలయంలో చోరీ

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలో గల బ్రహ్మంగారి మఠంలోని అష్టభుజాదేవి ఆలయంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో బుధవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. పూజారి శివయ్య మండలంలోని కనుగుట్టలో జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమానికి వెళ్లడంతో గురువారం ఆలయ తలుపులు తీయలేదు. శుక్రవారం ఉదయం గుడి తలుపులు తెరవగా వెనకభాగం తలుపులతోపాటు బీరువా ధ్వంసమైనట్లు గమనించాడు. వెంటనే స్థానికులు, పోలీసులకు సమాచారం అందించాడు. సీఐ కిరణ్ కుమార్‌తో పాటు ఎస్సై అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. బీరువాలోని 12 తులాల అమ్మవారి బంగారు ఆభరణాలు, 10వేల నగదు, పలు విలువైన వస్తువులు మాయమైనట్లు పూజారి తెలిపాడు. వేలిముద్రల సేకరణ కోసం పోలీసులు క్లూస్‌టీంను రప్పించారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీం సభ్యులు

నీలగిరి సాగుతో అధిక లాభాలు

పెంబి: రైతులు నీలగిరి సాగు చేసి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని సిర్పూర్ పేపర్ మిల్లు డీజీఎం సురేందర్ నర్కుడే పేర్కొన్నారు. మండలంలోని లోతర్వతండా గ్రామంలో రైతులకు శుక్రవారం ఆగ్రోఫారెస్ట్రీ తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. నీటి వసతి లేకున్నా వర్షాధారంగా నీలగిరి, కాజురైన, సుబాబుల్ ఆగ్రో ఫారెస్ట్రీ మొక్కల సాగు చేపట్టవచ్చని తెలిపారు. మూడేళ్లవరకు ఎకరాకు సుమారు రూ.1.50లక్షల వరకు స్థిరాదాయాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. ఇప్పటి వరకు మండల పరిధిలో 80ఎకరాల్లో నీలగిరి సాగు చేస్తున్నట్లు తెలిపారు. మొక్కలు నాటడం, వివిధ పనుల కోసం ఉపాధిహామీ ద్వారా రూ.25వేల నుంచి రూ.30వేల వరకు ఆర్థికసహాయం అందుతుందని చెప్పారు. కార్బన్ క్రెడిట్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఎకరాకు రూ.10వేల చొప్పున అదనంగా ఖర్చులకు ఇస్తుందని తెలిపారు. నీలగిరి తోటలను కంపెనీ కొనుగోలు చేసేందుకు అగ్రిమెంట్ బాండ్ పేపర్ రైతుకు అందించనున్నట్లు తెలిపారు. సర్పంచులు సాంకీబాయి, సుదర్శన్, తానాజీ, ఎంపీవో రత్నాకర్‌రావు, ఎస్‌పీఎం మేనేజర్ సంతోష్, జిల్లా మేనేజర్ శ్రీధర్, ప్లాంటేషన్ ఆఫీసర్లు ప్రణీత్, అరుణ్, మండల కోఆర్డినేటర్ సురేందర్, ఏఈవో రాజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.



రైతుకు ఒప్పంద పత్రం ఇస్తున్న అధికారులు

సీజేఎల్‌లకు రెగ్యులర్ పోస్టింగ్‌లు

- జిల్లాలో మొత్తం 134 మంది
- ప్రస్తుతం 124 మందికి పోస్టింగ్
- వెయిటింగ్‌లో పదిమంది

నిర్మల్: ఏళ్లుగా ఎదురుచూస్తున్న కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్(సీజేఎల్)ల కల ఎట్టకేలకు నెరవేరింది. జిల్లాలోని సీజేఎల్‌లకు శుక్రవారం అర్ధరాత్రి రెగ్యులర్ పోస్టింగ్‌లలు అందించారు. జిల్లాకేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలలో డీఐఈఓ, నోడల్ అధికారి పరశురాం, ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లు పోస్టింగ్ ఆర్డర్లను అందజేశారు.

23 ఏళ్ల తర్వాత..

సరిగ్గా 23 ఏళ్ల తర్వాత కాంట్రాక్టు లెక్చరర్‌లు రెగ్యులర్ పోస్టింగ్ అందుకున్నారు. 2000లో అప్పటి ప్రభుత్వం ఈ పోస్టులు ఏర్పాటు చేసింది. అంతకుముందు పార్ట్‌టైం లెక్చరర్‌ల పేరిట ఈ పోస్టులు ఉండేవి. జిల్లాలో మొత్తం 134మంది సీజేఎల్‌లు ఉన్నారు. ఇందులో సంబంధిత పోస్టులు మంజూరు ఉన్న 124మందికి పోస్టింగ్‌లు ఇచ్చారు. పోస్టులు మంజూరు లేని మరో పదిమంది వెయిటింగ్‌లో ఉన్నారు. కొన్నేళ్లుగా తమను రెగ్యులరైజ్ చేయాలని సీజేఎల్‌లు పోరాటం చేస్తూ వస్తున్నారు. ఎన్నికల హామీలో భాగంగా సీఎం కేసీఆర్ గత నెల 30న కొత్త సచివాలయం ప్రారంభోత్సవం రోజున వీరిని రెగ్యులరైజ్ చేస్తూ ఫైల్‌పై సంతకం చేశారు. ఆ తర్వాత నుంచి గతంలో పెట్టిన కేసులు, కోర్టులు ఇచ్చిన తీర్పుల ఆధారంగా ప్రక్రియ పూర్తి చేసి, శుక్రవారం రాత్రి రెగ్యులర్ ఆర్డర్‌లు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఎట్టకేలకు రెగ్యులర్ పోస్టింగ్‌లను అందుకోవడంపై లెక్చరర్‌లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బాలికల జూనియర్ కళాశాలలో పోస్టింగ్‌లు తీసుకుంటున్న సీజేఎల్‌లు

న్యూట్రీ కిచెన్ కూరగాయల్లో పోషకాలు

దిలావర్‌పూర్: గ్రామాల్లో న్యూట్రీ కిచెన్ ద్వారా సాగుచేసిన కూరగాయల్లో పలురకాల పోషకాలు ఉంటాయని కలెక్టర్ వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సాంగ్వి గ్రామంలో పలు అభివృద్ధి పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ముందుగా పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించి తగు సూచనలు, సలహాలు చేశారు. గ్రామంలో ‘మన ఊరు-మన కూరగాయలు’ పేరిట న్యూట్రీకిచెన్‌ను ఆయన ప్రారంభించారు. న్యూట్రికిచెన్ గార్డెన్ ద్వారా పూర్తిగా సేంద్రీయ పద్ధతులను పాటించి మంచి పోషక విలువలతో కూడిన కూరగాయలు పొందవచ్చన్నారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును ఆయన పరిశీలించారు. సీఈవో సుధీర్‌బాబు, ఎంపీడీవో మోహన్‌రెడ్డి, ఎంపీవో అజీజ్‌ఖాన్, సర్పంచ్ అచ్యుత్‌రావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సుభాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సాంగ్విలో న్యూట్రీకిచెన్ గార్డెన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

కాలనీల పరిశీలన

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్, సాగర్ కాలనీల్లో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్‌తో కలిసి కలెక్టర్ వరుణ్‌రెడ్డి శుక్రవారం పర్యటించారు. బస్టాండ్ నుంచి సాగర్‌కాలనీ వరకు రోడ్డు సమస్య పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని గురువారం కోరారు. దీంతో ఎస్సార్ డీజీ స్కూల్ వద్ద ఇరుకుగా ఉన్న రోడ్డు, కందకాన్ని కలెక్టర్ పరిశీలించారు. సీసీ రోడ్డు ఏర్పాటుకు మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో ప్రతిపాదనలు పూర్తిచేసి త్వరగా పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రానున్న వానాకాలంలో తీసుకోవాల్సిన చర్యలపై మున్సిపల్ అధికారులతో చర్చించారు. మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, అర్బన్ తహసీల్దార్ సుభాష్‌చందర్, కౌన్సిలర్ ముజాయిద్‌చౌస్, కాలనీవాసులున్నారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న దేవిమురళి

లక్ష్మణచాంద: బాలలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని డీసీపీవో దేవిమురళి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో వరల్డ్ విజన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీ గ్రామంలో బాలల హక్కుల పరిరక్షణ కోసం కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాలల సంరక్షణ కమిటీలు ఆయా గ్రామాల్లోని బాలలకు వారి హక్కుల గురించి అవగాహన కల్పించాలని, బాలలకు నాయకత్వ లక్షణాలు నేర్పించాలని సూచించారు. వరల్డ్ విజన్ జిల్లా కోఆర్డినేటర్ బ్రహ్మన్న, బాలల హక్కుల కమిటీ సభ్యులు స్వదేశ్, వహీద్, మండలంలోని 18 గ్రామాల బాలల హక్కుల సభ్యులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసాతో నిరసన

నిర్మల్‌చైన్‌గేట్: బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని కాంగ్రెస్ కర్ణాటకలో చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం బీజేపీ నాయకులు హనుమాన్ చాలీసాను పఠిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ మాట్లాడారు. కాంగ్రెస్ ఒక వర్గానికి సంబంధించిన ఓట్లు దండుకోవడానికి ముస్లింలకు దగ్గరవుతూ భజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని అనడం యావత్ భారత సమాజానికే సిగ్గుచేటన్నారు. భారతీయ సంస్కృతి ఒక గొప్ప సంస్కృతి అని, హనుమంతుడి భక్తులు బజరంగ్‌దళ్‌ను రామరాజ్యం ఏర్పాటు చేసుకునే దిశగా ప్రయత్నిస్తుంటే ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రామరాజ్య స్థాపనకు ప్రధాని మోదీ కృషి చేస్తానంటే ఓర్వలేకే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు మెడిసెమ్మె రాజు, రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు అలివేలుమంగ, కమల్ నయన్, సీనియర్ నాయకులు డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి, దళిత జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రజిని, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొన్నం నారాయణగౌడ్, బీజేవైఎం రాష్ట్ర స్టడీ సర్కిల్ కన్వీనర్ కుమ్మరి వెంకటేశ్, యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అనుముల శ్రావణ్, సీనియర్ జిల్లా నాయకులు అంజుకుమార్‌రెడ్డి, దొడ్డికింది ముత్యంరెడ్డి, మండలాధ్యక్షులు లింగారెడ్డి, శైలేశ్, విలాస్, గోవర్ధన్, అల్లం భాస్కర్, నాయకులు లవకుమార్ గౌడ్, చిన్ను, కొండాజీ రాఘవేంద్రాచారి, నరేందర్, రమేశ్, నరేశ్, భరత్ నారాయణ పాల్గొన్నారు.



బోయివాడ హనుమాన్ ఆలయం వద్ద చాలీసాను పఠిస్తున్న కార్యకర్తలు